క్లుప్తంగా

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



పాదచారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎస్ఎంఆర్ పెదబాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సినీ హీరో సాయిధర్మ తేజ అభిమానుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఏలూరు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు శనివారం ప్రారంభించారు. హీరో సాయిధరమ్ తేజ అభిమానులు ఇటువంటి స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పెదబాబు అన్నారు. సాయిధరమ్ తేజ అభిమాన సంఘం నాయకులు మాట్లాడుతూ సాయిధరమ్ తేజ నటించిన చిత్రం విరూపాక్ష ఈనెల 21న విడుదల కానున్న సందర్భంగా స్థానిక సీఆర్‌ఆర్ కాలేజీలో ఈ నెల 16వ తేదీ ఆదివారం సాయంత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమానికి చిత్ర హీరో సాయిధరమ్ తేజ్, సినీ నటీ,నటుల బృందం హాజరు కానున్నారన్నారు. ఫ్యాన్స్ ప్రెసిడెంట్ కట్టా ఆది, శానం రామకృష్ణ, పి.పెద్దబాబు, మెగా అభిమానులు పాల్గొన్నారు.

మత్తేబాబికి గౌతమబుద్ధ నేషనల్ ఫెలోషిప్



బాబికి అవార్డు అందిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు మత్తే బాబికి గౌతమ బుద్ధ నేషనల్ ఫెలోషిప్ అవార్డు లభించింది. ఫిలామ్ ట్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 132వ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని విజయవాడలోని హోటల్ ఐలాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు బాబికి అవార్డు అందజేశారు. ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పాల్గొని అవార్డు గ్రహీతలకు సత్కారం చేసి పురస్కారాలను అందజేశారు.

రైల్వే గేటు అండర్‌పాస్ పనుల ప్రారంభం

దెందులూరు: దెందులూరు– అలుగులగూడెం రైల్వేగేటు వద్ద అండర్‌పాస్ పనులను శనివారం దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. 90 రోజుల పాటు రైల్వే గేటు మూసివేస్తామని తెలిపారు.

మహిళా సాధికారతే ధ్యేయం

ఎమ్మెల్యే ఆళ్ల నాని



43వ డివిజన్‌లో లబ్ధిదారులకు బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్

ఏలూరు టౌన్: సమాజం, కుటుంబం అభివృద్ధి చెందాలంటే మహిళదే కీలకపాత్రని, మహిళల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలో 89వ రోజు శనివారం కొత్తపేట నూకాలమ్మగుడి రోడ్డు ఏకేజీ సెంటర్ నుంచి ఎమ్మెల్యే నాని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. 43వ డివిజన్ కార్పొరేటర్ జనపరెడ్డి కనకశ్రీ రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు జనపరెడ్డి కృష్ణ ఆధ్వర్యంలో నానికి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. పాదయాత్రలో రాష్ట్ర వ్యాప్తంగా అక్క చెల్లెమ్మలు చెప్పిన అనేక అంశాలను బేరీజు వేస్తూ వారి ఆకాంక్షలకు అనుగుణంగా పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. నేడు ఒక్కో కుటుంబంలో నాలుగు నుంచి ఐదు పథకాలు అందుతున్నాయని, నాలుగేళ్ల కాలంలో ఒక్కో కుటుంబం సుమారు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పైగా లబ్ధి పొందిన పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఏనాడైనా టీడీపీ హయాంలో ప్రజలకు ఇంత మేలు జరిగిందా అని ఎమ్మెల్యే నాని ప్రశ్నించారు. పేద వర్గాల ప్రజలకు మేలు చేయటం, మహిళల అభివృద్ధి కోసం సీఎం జగన్ విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, బండారు కిరణ్‌కుమార్, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్లు నున్న స్వాతిశ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, పొలిమేర దాసు, ఏఎంసీ డైరెక్టర్ మేతర సురేష్, పార్టీ లీగల్‌సెల్ దొంగ రామాంజనేయులు, ఆచంట వెంకటేశ్వరరావు, నాయకులు ఇనపనూరి జగదీష్, పిట్టా ధనుంజయ్, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, పీఓ కృష్ణమూర్తి, ఎంహెచ్ఓ డాక్టర్ మాలతి, సచివాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలి



15వ డివిజన్ సమీక్ష అనంతరం ఎమ్మెల్యే నానితో కార్పొరేటర్ రాము, సిబ్బంది



2వ డివిజన్ సమీక్ష అనంతరం ఎమ్మెల్యే నానితో కార్పొరేటర్, సచివాలయ సిబ్బంది

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో ప్రజా సమస్యల సత్వర పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నగరంలోని 1, 2, 15 డివిజన్లకు సంబంధించి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన వినతుల పరిష్కారంపై శనివారం ఆయన అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులతో సమీక్షించారు. గడపగడపకు కార్యక్రమంలో ప్రజలు విన్నవించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నాని చెప్పారు. ప్రజలకిచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలుకు కృషి చేయాలన్నారు. ప్రతి సమస్యను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్హత ఉన్నా సంక్షేమ పథకాలు పొందలేని వారికి వాటిని అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో నగర కమిషనర్ వెంకటకృష్ణ, పీఓ కృష్ణమూర్తి, తహసీల్దార్ సోమశేఖర్, డిప్యూటీ మేయర్లు శ్రీనివాసరావు, సుధీర్‌బాబు, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు దిరిశాల వరప్రసాద్, కోఆప్షన్ సభ్యులు పెదబాబు, జాన్‌గురునాథ్, కార్పొరేటర్లు తంగెళ్ల రాము, జున్నూరు నరసింహారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

వేద పాఠశాల అభివృద్ధికి సహకారం



వేద పాఠశాల కమిటీ పెద్దలతో ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్: ఏలూరు పవర్‌పేటలోని సంస్కృతి వేద పాఠశాల అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్ నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో సంస్కృత వేద పాఠశాల కమిటీ సభ్యులు, ప్రముఖులు ఎమ్మెల్యే నానిని ప్రత్యేకంగా కలిసి వేద పాఠశాల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ పూర్తిస్థాయిలో ఆధ్యాత్మిక చింతనతో వేద పాఠశాల విద్యార్థులకు మెరుగైన రీతిలో తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. వేద పాఠశాలలోని సమస్యల పరిష్కారానికి దేవదాయ శాఖ అధికారులతో చర్చిస్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నానిని వేద మంత్రాలతో పండితులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్, మెడికల్ బ్రాహ్మణ ఎంప్లాయీస్ సెక్రటరీ కె.కృష్ణమాచార్యులు, హేలాపురి సంస్కృత పాఠశాల అధ్యక్షుడు ఈదర రమణ ప్రసాద్, సెక్రటరి విశ్వనాథ శాస్త్రి, గోపాలరాజ్ వెంకట్రామయ్య, డిప్యూటీ మేయర్లు శ్రీనివాసరావు, సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యులు పెదబాబు, కిరణ్ కుమార్, ఏపీ మెడికల్ బోర్డు సభ్యులు వరప్రసాద్, ఏఎంసీ చైర్మన్ మైబాబు, కార్పొరేటర్ యర్రంశెట్టి సుమన్, కిలాడి దుర్గారావు తదితరులు ఉన్నారు.

పూర్తిస్థాయిలో నీరందించడమే లక్ష్యం



చాటపర్రులో ఫిల్టర్‌బెడ్లలో ఇసుక శుభ్రం చేస్తున్న కూలీలు



ఏలూరు రూరల్ : ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు ఏలూరు మండల గ్రామాల్లో వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చేయడమే లక్ష్యమని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. శనివారం ఆయన ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సరళకుమారి, పీఆర్ ఏఈ కృష్ణమోహన్‌తో గ్రామాల్లో సమస్యలపై ఆయన చర్చించారు. చాటపర్రులో సుమారు రూ.7 లక్షలతో రెండు ఫిల్టర్ బెడ్లుకు మరమ్మతులు చేపట్టామన్నారు. కొద్దినెలల క్రితం ఈ గ్రామంలో ప్రభుత్వం సుమారు రూ.9 లక్షలతో రెండు ఎంఎల్‌టీ ఆర్ఎస్ఎఫ్ (రాఫిడ్ సాండ్ ఫిల్టర్) కొత్తగా ఏర్పాటు చేసిందని చెప్పారు. జాలిపూడిలో జెడ్పీ నిధులతో రెండు ఫిల్టర్ బెడ్లు అభివృద్ధి చేశామని, కొల్లేరు గ్రామాల ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందించేందుకు మొండికోడు రిజర్వాయర్ గోదావరి నీటితో పూర్తిగా నింపుతున్నామని చెప్పారు. మాదేపల్లి, చాటపర్రు, తిమ్మారావుగూడెం, కోటేశ్వరదుర్గాపురం, కాట్లంపూడి, జాలిపూడి తాగునీటి చెరువులు కృష్ణా కెనాల్ నీటితో నింపామన్నారు. మరికొద్దిరోజుల్లో శ్రీపర్రు, మానూరు చెరువులనూ పూర్తి స్థాయిలో నింపుతామని తెలిపారు.

మే 17 నుంచి చండీయాగ మహోత్సవాలు



కరపత్రం విడుదల చేస్తున్న పెదబాబు, అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విశ్వశాంతి, లోకకల్యాణార్థం త్రి శక్త్యాత్మిక శ్రీదేవి శత చండీ యాగ మహోత్సవాలు మే 17వ తేదీ నుంచి ప్రారంభమౌతాయని ఏలూరు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. శనివారం స్థానిక కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో చండీ యాగ మహోత్సవాల కరపత్రాన్ని పెదబాబు, కార్పొరేటర్ ఎర్రంశెట్టి సుమన్, ఏలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బడేటి చంటిలు విడుదల చేశారు. సుమారు 100 సంవత్సరాల క్రితం నుంచి పూజలందుకుంటున్న విశ్వేశ్వరస్వామి ఆలయంలో యాగ మహోత్సవాలను మే 17 నుంచి 24 వరకు నిర్వహిస్తామని, 28న మహా అన్నసమారాధన ఉంటుందని చెప్పారు. ఏలూరు ప్రజలందరూ పాల్గొని, అమ్మవారి ఆశీస్సులను పొందాలని వారు కోరారు.

సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న కేంద్రం



ప్రచార భేరిలో మాట్లాడుతున్న బండి వెంకటేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా సంపదను కార్పొరేట్లకు దోచి పెడుతోందని సీపీఐ కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తోన్న ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ సంస్థల అనుకూల విధానాలను నిరసిస్తూ ఏలూరు నగరంలో సీపీఐ, సీపీఎం పార్టీలు ప్రచార భేరి శనివారం నిర్వహించాయి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం గ్యాస్, పెట్రోలు, డీజిల్, విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచిందన్నారు. వ్యవసాయ రంగాన్నీ కార్పొరేట్ పరం చేయడానికి ప్రయత్నించిందని తెలిపారు. అదాని అవినీతి వ్యవహారం ఇండియన్ బర్గ్ నివేదిక బట్టబయలు చేసిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా కేంద్రం మోసం చేసిందని, విభజన హామీలు అమలు చేయలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు పి.కిషోర్, ఉప్పులూరి హేమ శంకర్, పి.ఆదిశేషు, వి.సాయిబాబా, బి.జగన్నాథరావు, జె.గోపి, కె.రామాంజనేయులు, ఎస్ సత్యనారాయణ, కడుపు కన్నయ్య, కురెళ్ల వరప్రసాద్, కొల్లూరి సుధారాణి, బళ్ల కనకదుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	74
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	60
వంకాయలు (తెలుపు)	30	ములక్కాడలు	05-07
బెండకాయలు	24	కంద	48
పచ్చిమిర్చి	32	బీట్‌రూట్	36
కాకర కాయలు	30-34	కీరా దోస	32
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	96
బీరకాయలు (పందిరి)	50	అల్లం	130
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	30	పాలకూర	10
దొండకాయలు	24	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	08
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	26	బఠాణి	60
ఆనబకాయ (1)	10-12	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	12
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	27
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	29

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	16
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	10
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	10
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	10
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	33
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - బెంగళూరు	14.00	4021	--
ఏలూరు -తిరుపతి	16.00	4830	31

పెరుగుతున్న జ్వర బాధితులు

పెదవేగి : నియోజకవర్గంలో ప్రతి ఇంటా జ్వరం లేదా దగ్గు, జలుబు బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. సహజంగానే ఈ సీజన్‌లో వ్యాధుల వ్యాప్తి చెందుతాయి. ఇప్పటికే కరోనా కేసులు జిల్లాలో పలు చోట్ల నమోదవుతున్న తరుణంలో జ్వర బాధితులు కలవర పడుతున్నారు. వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల శ్వాసకోశ సంబంధిత వ్యాధులున్న వారికి సహజంగానే జలుబు, జ్వరం రావొచ్చని అధైర్య పడొద్దని వైద్యులు అంటున్నారు. వైద్య సిబ్బంది నిర్దేశించిన సూచనలు పాటించాలని వారంటున్నారు. జ్వరం, దగ్గు వంటివి రెండు రోజులు దాటి ఉంటే కోవిడ్ నిర్ధారణ పరీక్ష చేయించాలని పెదవేగి పీహెచ్‌సీ వైద్యాధికారి పి పూర్ణిమ అన్నారు. పాజిటివ్ వస్తే భయపడాల్సిన పని లేదని, హోం ఐసోలేషన్లో ఉంటూ ప్రభుత్వం అందించే కోవిడ్ కిట్ వాడుతూ, బలవర్ధకమైన ఆహారం తీసుకుంటే ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై అప్రమత్తంగా ఉన్నామన్నారు. కరోనా నియంత్రణ చర్యలతో పాటు, దోమల నివారణకు, గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఇప్పటికే పంచాయతీలకు ఫాగింగ్ మెషీన్లు అందజేశాయడంతోపాటు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

శాశ్వత భవనాలు కోరుతూ 17 నుంచి దీక్షలు



ఐకమత్యం చాటుతున్న అఖిల పక్ష నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాల ఏర్పాటు కోరుతూ సోమవారం ప్రారంభించే రిలే నిరాహార దీక్షలకు తమ పూర్తి మద్దతు ఇస్తున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి రవి పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేయాలని శాశ్వత భవనాల సాధన సమితి ఆధ్వర్యంలో స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో శనివారం అఖిలపక్షాల సమావేశం పాశల దుర్గాప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజనాల రమ్మోహనరావు మాట్లాడుతూ డిగ్రీ కళాశాలకు తక్షణమే శాశ్వత భవనాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం నేత కిషోర్, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకుడు ఎండీ మస్తాన్ భాషా, జనసేన నాయకుడు శ్రావణ్ మాట్లాడుతూ విద్యార్థులు చేసే కార్యక్రమాలకు, కళాశాలకు శాశ్వత భవనాల ఏర్పాటుకు తమ వంతు సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నుంచి పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, ఏఐఎస్ఈ నాయకులు పాల్గొన్నారు.

విద్య ద్వారా జ్ఞానం వృద్ధి

పెదవేగి : గురువులు మార్గదర్శకులు అని, విద్య ద్వారా జ్ఞానం వృద్ధి చెందుతుందని యజ్ఞవల్క్య రాజాశ్రమం అభినవ వివేకానంద శ్రీకృష్ణ చరనానంద భారతి స్వామిజీ అన్నారు. పెదవేగి మండలం ముండూరు క్షేత్రంలోని యజ్ఞవల్క్య రాజా ఆశ్రమంలో 65వ వార్షికోత్సవ మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్వామీజీలు ప్రసంగించారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణ చరనానంద భారతి స్వామి మాట్లాడుతూ శనివారం నుంచి మూడు రోజులపాటు వేదాంత మహాసభలను నిర్వహిస్తామన్నారు. ఈ దివ్య కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుంచి జ్ఞానానిధులైన పీఠాధిపతులు, ఆశ్రమాధిపతులైన సాధు మహాత్ములు వేదాంత మహాసభల్లో పాల్గొని వారి దివ్యమైన బోధనలను అందిస్తారని ఆయన అన్నారు. మొదటి రోజు వేదాంత సభలో పలువురు స్వాములు ఉపన్యసించారు. కార్యక్రమంలో అవధూత స్వరూపానంద గిరి స్వామి, పరమానంద గిరి స్వామి, ప్రతిష్టానంద సరస్వతి స్వామి, తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జీఎస్ఆర్ చౌదరి, రామానంద స్వామి భక్తులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న వృద్ధురాలు

ఏలూరు రూరల్: వడ్డీ పేరుతో మోసగించిన వ్యక్తిని అరెస్ట్ చేయాలని ఓ వృద్ధురాలు ఏలూరు మండలం చాటపర్రు గ్రామ రామాలయం వద్ద రెండురోజుల నుంచి నిరసన వ్యక్తం చేస్తోంది. చాటపర్రుకు చెందిన మద్రావు వెంకటలక్ష్మి అనే వృద్ధురాలు విజ్జి మోహనరావు అనే వడ్డీ వ్యాపారికి కొంత డబ్బు అప్పు ఇచ్చింది. కొంతకాలంగా మోహన్‌రావు వడ్డీ కట్టకపోగా అసలు సైతం చెల్లించడం లేదని గత సోమవారం జిల్లా కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసింది. నిరసన వ్యక్తం చేస్తోన్న వృద్ధురాలుకు మరో మహిళ తోడుకాగా, స్థానికులు వృద్ధురాలుకు న్యాయం చేయాలని కోరుతున్నారు. దీనిపై స్పందించిన పోలీసులు వడ్డీ వ్యాపారిని స్టేషన్‌కు పిలిచి విచారించారు.

నేటి నుంచి సహాయ నిరాకరణ



విద్యుత్ భవన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈపీడీసీఎల్ ఏలూరు ఎస్ఈ పి.సాల్మన్ రాజు అనుసరిస్తోన్న కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం స్థానిక విద్యుత్ భవన్ వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఎస్ఈ సాల్మన్ రాజు కార్మికులను అవమానించే విధంగా మాట్లాడుతున్నట్టు చెప్పారు. వివిధ స్థాయిల్లో పదోన్నతుల ఆర్డర్లు ఇవ్వడం లేదని, తమ యూనియన్ అంటే వివక్ష చూపుతున్నారని, దానిలో భాగంగానే తమ యూనియన్ రీజనల్ కార్యదర్శిని అవమానించారని తెలిపారు. దీనిపై సర్కిల్ పరిధిలోని 1200 మంది కార్మికులు ఆదివారం నుంచి సహాయ నిరాకరణ చేస్తారని చెప్పారు. ఈ నిరసనలో యూనియన్ నాయకులు ఎస్.నరసింహరావు, ఎం. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ కళాశాలలో అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు



ప్రిన్సిపాల్ డాక్టర్ నత్తానియేల్

దెందులూరు: గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం, 400 మీటర్ల సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వానికి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు నివేదిక పంపామని వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నత్తానియేల్ అన్నారు. శనివారం కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కలెక్టర్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కళాశాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చొరవ తీసుకున్న నేపథ్యంలో వారి ఆదేశాలకనుగుణంగా కళాశాలలో ప్రాధాన్యమైన ట్రాక్, స్టేడియం అవశ్యకతను, అంచనాలను నివేదికల రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి శనివారం పంపించినట్టు తెలిపారు. అనుమతుల మంజూరు అనంతరం కళాశాలలోని వసతులు విద్యార్థులకు ఉపయోగపడతాయని ప్రిన్సిపాల్ వివరించారు.